క్లుప్తంగా

మహిళలు చైతన్యవంతులు కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న లలిత సేవా సంఘం ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లల పాలెం వుడాకాలనీలో ఆదివారం స్థానిక లలిత సేవా సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరు ఇక్కడ పేద విద్యార్థులకు పుస్తకాలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి తమ సంస్థ తరపున నగర నలుమూలల నిరుపేద మహిళలకు అవసరమైన సాయం అందిస్తున్నట్టు చెప్పారు. నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహారం,పుస్తకాలను పంపిణీ చేశారు.

ఘనంగా వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం



స్వామికి పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు, భక్తులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటా కాలనీలోని వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసి కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యు లు, స్థానిక పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మాధవ్ గెలుపు కోసం హోమం



సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో హోమం చేస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: బీజేపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్ గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నగర కార్యదర్శి సీహెచ్ మంజుల, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దాడి పురుషోత్తం రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఏడీ సమీపంలోని శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాధవ్ గెలుపు సుసాధ్యమని, అందుకే ఈ హోమం చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జీసీ నాయుడు, వలిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి, వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



సాగర తీరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆస్పత్రి సిబ్బంది, నగర యువత పాల్గొన్నారు. గ్లకోమా అనేది కంటిపై ఒత్తిడి పెరుగుదలతో వచ్చిన సమస్య అని, ఇది కోలుకోలేని అంధత్వానికి దారితీస్తుందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.



పిలకవానిపాలెం జీవీఎంసీ పాఠశాలలో సిద్ధం చేసిన 273 పోలింగ్ బూత్



సింధియా జీవీఎంసీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 274 పోలింగ్ బూత్



గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయ

పోలింగ్‌కు సర్వం సిద్ధం

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

మల్కాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రానికే పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచే పోలీసులు కేంద్రాలకు చేరుకోవడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సాధారణ ఎన్నికల వాతావరణం తలపిస్తోంది. పట్టభద్రుల ఓటర్ల కోసం గదుల వద్ద బూత్ నంబర్లతో కూడిన చార్టులు పెట్టారు. ఏయే బూత్‌లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో తెలుపుతూ ముందుగా ఓ బోర్డు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఆర్టీసీ బస్‌లలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రితో పోలీస్ బందోబస్తు మధ్య కేంద్రాలకు చేరుకొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పోలింగ్‌కు పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు,గాజువాక స్టేషన్ పరిధిలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పా టు చేశారు. సింధియా జీవీఎంసీ పాఠశాలలో 274 పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పురుషులు 571 మంది, స్త్రీలు718 మంది ఓటును వినియోగించుకోనున్నారు. అలాగే ప్రకాష్ నగర్ జీవీఎం ప్రాథమిక పాఠశాలలోఏర్పాటు చేసిన 275 పోలింగ్ బూత్‌లో పురుషులు 547 మంది,స్త్రీలు 632 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పిలకవానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వద్ద 274 పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఇక్కడ పురుషులు 510 మంది, స్త్రీలు 560 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచారు. ములగాడ మండల తహసీల్దార్ ఎం.వీరభద్రరావు,సీఐ లూథర్‌బాబు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు సామగ్రితో చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ఏర్పాట్లు పూర్తి

గోపాలపట్నం: పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో గోపాలపట్నం మండల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. మధ్యాహ్నానికే పోలింగ్ సిబ్బంది పోలింగ్ సామగ్రితో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు.

తహసీల్దార్ అసంతృప్తి..

గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లపై తహసీల్దార్ జయ అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి వ్యవహార శైలిపై మండిపడ్డారు. పోలింగ్ బూత్‌లో కనీసం బెంచీలు కూడా లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.



బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు 52వ వార్డు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ అని అన్నారు. సంక్షేమం, అభివృద్ధితో దూసుకు పోతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, వెదుళ్ల శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



52వ వార్డు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జియ్యాని శ్రీధర్

మొక్కలు నాటడం మంచి అలవాటు

గోపాలపట్నం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకోవాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆకాంక్షించారు. అఖిల భారతీయ యాదవ మహాసభ అహిర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందాపు గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 57వ వార్డు దుర్గాపురంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచి సంరక్షించాలని సూచించారు. తద్వారా భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించిన వారిమవుతామని చెప్పారు. కార్యక్రమంలో 57వ వార్డు కార్పొరేటర్ ముర్రి వాణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్, జనసేన పార్టీ వార్డు ఇన్‌చార్జి కాళ్ల మణి ప్రసాద్, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యామ్ కుమార్‌రెడ్డి, టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి కామాకుల చంద్రరావు, బొడ్డేపల్లి హేమలత తదితరులు పాల్గొన్నారు.



దుర్గాపురంలో మొక్క నాటుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి
- రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: రైల్వే ఉద్యోగులు, అధికారుల కోసం వాల్తేర్ డివిజన్ ఆదివారం దొండపర్తిలోని రైల్వే హాస్పిటల్‌లో న్యూరో, కార్డియాలజీ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి పర్యవేక్షణలో రైల్వే ఆస్పత్రి వైద్యుల బృందం సేవలందించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. వ్యక్తిగత ఆరోగ్యం, పోషణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి రైల్వే ఉద్యోగి, సిబ్బంది బాధ్యతని పేర్కొన్నారు. నిర్దేశిత సమయాల్లో ఇటువంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అధికారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వారికి నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఈ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్ఎం చెప్పారు. మెడికల్ క్యాంప్‌లో సుమారు 57 మంది అధికారులు, 3 కుటుంబాల సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా.. వీరిలో కొత్తగా నలుగురు హైపర్ టెన్షన్‌తో, ఇద్దరు డయాబెటిస్ మెల్లిటస్‌తో, ఇద్దరు ఇష్కిమిక్ హార్ట్ డిసీజస్‌తో బాధపడుతున్నట్లు కనుగొన్నారు. వీరిలో అవసరమైన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

విస్తృతంగా వాహనాల తనిఖీలు



కోరమాండల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ లూథర్‌బాబు,సిబ్బంది



యారాడ మార్గంలో కారును తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్‌రావు

మల్కాపురం: ఈ నెల 13వ తేదీ సోమవారం జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, నగదు, వస్తువులను వాహనాల్లో తరలించే అవకాశం ఉన్నందున్న మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. కోరమాండల్, శ్రీహరిపురం, మల్కాపురం, జనతా కాలనీ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో సీఐ లూథర్ బాబు తన సిబ్బందితో కలిసి కార్లు, మినీ వ్యాన్లు, మినీ బస్సులు మొదలగు వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా వాహనాల పత్రాలు, డ్రైవర్ ఐడీ కార్డులను పరిశీలించి, అనుమానాస్పదంగా ఉన్న వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శనరావు యారాడ ఘాట్ రోడ్డులో పలు వాహనాలను తనిఖీ చేసి వాటి పత్రాలను పరిశీలించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



రైలు పట్టాలపై మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్ఐ

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొన్న సంఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఎస్ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం గాజువాక జోగవానిపాలెంకు చెందిన బోను సూర్యనారాయణ (74) ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రైలు పట్టాలు దాటుకుంటూ ఫార్మా సిటీ కాలనీ వైపు వెళ్తున్నాడు. ఈ సమయంలో అనకాపల్లి నుంచి దువ్వాడ వైపు వస్తున్న గూడ్స్ రైలు అతన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లోకో పైలట్ సమాచారం మేరకు దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుని సమాచారం తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా ఈత పోటీలు



ఈత పోటీలను ప్రారంభిస్తున్న వరప్రసాద్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ఈత పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్విమ్మర్లు పోటీపడ్డారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు, డెకథ్లాన్ స్పోర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 106 మంది పాల్గొనగా.. వీరిలో 62 మంది చిన్నారులు ఉన్నారు. వయసుల వారీగా పోటీలు జరిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి సనపల వరప్రసాద్, భారత వాయు సేన రిటైర్డ్ వారంట్ ఆఫీసర్ వాకర్ సోమనాథ్ సాహూ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్క్ కార్యదర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షులు బోయపాటి శ్రీనివాస్, శాంత భూషణ్, కోశాధికారి కె.కుర్మారావు, కె.సురేష్, సంయుక్త కార్యదర్శి బి.త్రినాథ స్వామి, కార్యవర్గ సభ్యులు మళ్ల రామకృష్ణ, పల్లా చంద్రమౌళి, కనకరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



మందులు అందిస్తున్న డాక్టర్ రమణమూర్తి

గోపాలపట్నం: దివంగత పార్లమెంట్ సభ్యుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి సందర్భంగా కళింగ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 89వ వార్డు ఖర్వేల్‌నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి ప్రారంభించారు. రాజగోపాలరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమన్న నానుడిని నిజం చేసేందుకు ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అవసరమన్నారు. కళింగుల సంక్షేమానికి తన వంతు సహకారం అందజేస్తానని చెప్పారు. కళా ఆస్పత్రి తరఫున వైద్య సేవలు అందించేందుకు నిత్యం సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం బీపీ, సుగర్, గుండె సంబంధిత, థైరాయిడ్, మోకాళ్ల నొప్పులు, కిడ్నీ, లివర్, ఆస్మా, దగ్గు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా సీఈజీ పరీక్షలు నిర్వహించారు. 800 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు అయితంశెట్టి గోపి సందర్శించారు. కళింగ సంక్షేమ సంఘం సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాల్ టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు ఆదివారం డ్రా తీశారు. 159 మంది రైతులకు సంబంధించిన 63 స్టాళ్లకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలో వ్యాపారాలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతు వ్యాపారులు పాల్గొన్నారు.

16న మహా అన్నదానం

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం మహా అన్నదానం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం కళా హాస్పిటల్ అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడి రమణమూర్తి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

కళాకారుల క్రికెట్ విజేత డాల్ఫిన్ డాన్

దాబాగార్డెన్స్: కళాకారుల క్రికెట్ టోర్నమెంట్‌లో డాల్ఫిన్ డాన్ విజయం సాధించింది. రెడ్ హిల్స్ రైడర్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. గత మూడు రోజులుగా సాగిన కళాకారుల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. వైజాగ్ ఆర్టిస్ట్స్ క్రికెట్, సత్‌గీత్ క్రియేషన్స్, శ్రీవిష్ణు స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞానాపురం సోఫియా జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో పోటీలు జరిగాయి. ఫైనల్ పోటీలో ఇరుజట్లు పోటాపోటీగా తలపడ్డాయి. 6 వికెట్ల తేడాతో రెడ్‌హిల్స్ రైడర్స్ జట్టుపై డాల్ఫిన్ డాన్ గెలుపొందింది. మహిళల విభాగంలో నైటింగేల్ టీంపై మదర్ థెరిసా జట్టు గెలుపొందింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు గణేష్ రథో మాట్లాడుతూ ప్రజలకు తమ కళ ద్వారా వినోదాన్ని పంచే కళాకారులకు క్రికెట్ టోర్నమెంట్ ఒక ఆటవిడుపులా మారిందన్నారు. ప్రొఫెషనల్ క్రీడాకారులు మాదిరిగానే కళాకారులు కూడా విజయం కోసం పోరాడడం గొప్ప విషయమన్నారు. క్రీడల్లో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా క్రీడా స్ఫూర్తి అన్నది మనిషి జీవితానికి ఒక టానిక్‌లా పని చేస్తుందన్నారు. రెడ్డెం యాద కుమార్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా కళాకారుల క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సినీ, బుల్లి తెర, రంగస్థల కళాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది కూడా మరింత ఉత్సాహభరిత వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎస్. ఫణిస్వామి, భూమాత ఈడీ కిరణ్, సంగీత కళాకారుల అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, విశాఖ కళాకారుల సంఘం అధ్యక్షుడు క్యాలు జనార్దన్, రాపేటి అప్పారావు, మోహన్, వినోదిని, ప్రకాష్, నటులు నాంచారయ్య, టి. ధనుంజయ, శివజ్యోతి, హేమ తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన డాల్ఫిన్ డాన్ జట్టు

డ్వాక్రా స్టాళ్లలో మహిళలే విక్రయించాలి

సీతంపేట: డ్వాక్రా స్టాళ్లలో మహిళలే విక్రయించాలని, సహాయకులుగా మహిళలనే నియమించుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్ అన్నారు. ఆదివారం ఉదయం నరసింహనగర్ రైతుబజార్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బజారులోని స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఎవరికి కేటాయించిన స్టాల్‌లో వారే విక్రయిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ధరల పట్టిక ప్రకారం విక్రయాలు జరిగేలా చూడాలని సిబ్బందిని యాసిన్ ఆదేశించారు. రైతుబజార్ ఈవో పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

అరకు అందాలు మైమరిపిస్తాయి..

- ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి
- నేషనల్ గ్రూప్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం

బీచ్ రోడ్డు: అరకు అందాలను నేరుగా చూసినా, చిత్రాల్లో చూసినా మనస్సును మైమరిపిస్తాయిని తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఏర్పాటు చేసిన నేషనల్ గ్రూప్ షో ద్వారా తెలిసిందని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో నేషనల్ గ్రూప్ షో పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న ఎగ్జిబిషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను చిత్రాల ద్వారా బంధించి రాబోయే తరాలకు అందించాలన్నారు. చిత్రలేఖనం అంత సులభం కాదన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు గీసిన చిత్రాలు మనస్సును హత్తుకుంటున్నాయన్నారు. నగరవాసులు ఈ ప్రదర్శనను సందర్శించి గిరిజన జీవన శైలిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ డి.సింహాచలం, ఎస్.శ్రీనివాస్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో చిత్రాలను తిలకిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

15 నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వీవ్స్ అండ్ క్రాఫ్ట్ బజార్ పేరుతో చేనేత హస్తకళ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ సంయుక్త కార్యదర్శి రేణుకా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. దసపల్లా హిల్స్‌లోని గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో బొబ్బిలి చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు, కళంకారీ డాలు, స్టోల్ అండ్ మార్బల్ గులక రాళ్లు, చేతితో అత్యంత కళాత్మకంగా తయారు చేసిన అనేక రకాల ఆకృతుల్లో తాటాకు బుట్టలు, బంజార సూది వర్క్ వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

పోర్టు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఎంవీపీ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దేవీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ప్రసన్నకుమార్, డాక్టర్ టీఎస్ దీప్తి ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులకు అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ కన్వీనర్ ఎం.ఎస్.ఎస్.సింగ్ పర్యవేక్షించారు.